www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 24 మే 2023

5

వైఎస్ఆర్

ఉపాధ్యాయ బదిలీల్లో ఖాళీలన్నీ చూపించాలి

కడప అర్బన్: ఉపాధ్యాయ బదిలీలల్లో ఖాళీలన్ని చూపించాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్యాం సుందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఎపిటిఎఫ్ కార్యాలయంలో ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రాంతాలకు సమీపంలోని 1, 2, 3 కేటగిరిలలోని ఖాళీలను బ్లాక్ చేయడం వల్ల సుదీర్ఘకాలంగా దూర ప్రాంతాలలో పనిచేసిన సీనియర్ ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని తెలిపారు. తాత్కాలిక పద్ధతిన కాకుండా రెగ్యులర్ ప్రాతిపదికన ఇంక్రిమెంట్లతో కూడిన పదోన్నతులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎయిడెడ్ ఉపాధ్యాయులకు కూడా సర్వీస్ పాయింట్లను ఇవ్వాలన్నారు. కౌన్సెలింగ్ వల్ల సెకండరి గ్రేడ్ ఉపాధ్యాయులు వేల సంఖ్యలో స్థానాలను ఎంపిక చేసుకోవడం కష్టతరమని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భాస్కరరెడ్డి, నాగరాజు, రాష్ట్ర కౌన్సిలర్లు ఖాదర్‌బాష, శ్రీనివాసరెడ్డి, గురవయ్య, జిల్లా కార్యదర్శి రమేష్‌రెడ్డి, జిల్లా కౌన్సెలింగ్ ప్రసాద్, శివానందం, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

కూలి సగమే!

- రోజుకు 'ఉపాధి' రూ.120లే
- డిమాండ్ పీరియడ్‌లో గైర్హాజరైతే గల్లంతే
- సదుపాయాల నగదు రూ.87 ఎగనామం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలోని ఉపాధి కూలీలకు కునికిపాట్లు తప్పడం లేదు. కేంద్ర ంలోని బిజెపి సర్కారు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నాల్ని చాప కింద నీరులా సాగిస్తూనే ఉంది. ఇందులోభాగంగా ఉపాధి హామీ కూలీలకు వసతుల కల్పన కింద ఇవ్వాల్సిన నగదు చెల్లింపులకు ఎగనామం పెట్టి ంది. ఇందులో టెంట్లు, తాగునీరు, మజ్జిగ, గడ్డపారలు, తట్టా బుట్ట, వేసవి అలవెన్స్, మేట్ల తొలగింపు తదితర సదుపాయాలకు ఇవ్వాల్సిన సుమారు రూ.60పైగా నిలిపేసింది. ఫలితంగా ఉపాధి కూలీ లు ఎండల నుంచి ఉపశమనం లభించకపోవడంతో నిర్దేశిత కొలత పరిమాణంలో పనుల్ని చేయడం లేదనే పేరుతో సగానికిపైగా తెగ్గో స్తుండడం ఆందోళన కలిగిస్తోంది.

జిల్లాలోని కమలాపురం నియోజకర్గం వల్లూరు మండల పరిధిలోని ఓబాయపల్లి, గోటూరు చెరువుల్లో ఉపాధి కూలీలకు వసతుల కల్పనలో ఉపాధి యంత్రాంగం విఫలమైంది. మండలంలోని 15 పంచాయతీల పరిధిలోని 51 ప్రదేశాల్లో ఉపాధి హామీ పనులు చేపట్టారు. 2,309 మంది హాజరయ్యారు. కేంద్రంలోని బిజెపి సర్కారు ఉపాధి పనుల్లో పారదర్శకత పేరుతో తెచ్చిన టిసిఎస్ నుంచి ఎన్ఐసి సాఫ్ట్‌వేర్ కింద డిమాండ్ పొందిన ఉపాధి కూలీలు వారంలో నాలుగు రోజులు పనులకు హాజరై మిగిలిన మూడు రోజులు వెళ్లకపోతే వారం రోజులపాటు ఉపాధి కల్పించినట్లు జమ చేసుకుంటోంది. ఫలితంగా డిమాండ్ పొందిన కూలీలు మూడు రోజుల ఉపాధిని వదులుకోవాల్సిన దుస్థితి దాపు రించింది.

'కూలి'కి పాట్లు

ఉపాధి కూలి సగానికి పరిమితమైంది. ఉపాధి ప్రదేశాల్లో కూలీల సంరక్షణకు ఉద్దేశించిన సదుపాయాల కల్పనను తుంగలో తొక్కింది. ఫలితంగా కూలి రూ.120 మించి పడడం లేదు. దీనికి తోడు ఉపాధి కూలీల వసతుల కల్పనకు ఇవ్వాల్సిన రూ.87 అలవెన్సను ఉపసంహరించుకుంది. ఫలితంగా వల్లూరు మండలంలోనే ఒక్కరోజుకు సంబంధించి కూలి రూ.2.77 లక్షలు, అలవెన్స్ కింద రూ. రెండు లక్షలు మేర మొత్తం 4.77 లక్షలు నష్టపోతున్నట్లు తేలు తోంది. గతంలో ఉపాధి కూలీలు రూ.30 వేసవి అలవెన్స్, మేట్ అలవెన్స్ రూ.27, తాగునీటికి రూ.ఐదు, గడ్డపారకు రూ.15, తట్టా బుట్టకు రూ.ఐదు, మజ్జిగకు రూ.ఐదు చొప్పున చెల్లించడం తెలిసిందే. టిసిఎస్ సాఫ్ట్‌వేర్ నుంచి కేంద్రం ఎన్ఐసి సాఫ్ట్‌వేర్‌లోకి మారడంతో కత్తిరింపులకు దిగడం ఆందోళన కలిగిస్తోంది. వేసవి అలవెన్స్‌ను రూ.23 ఇస్తున్నట్లు చెబుతున్నప్పటికీ ఐదు గంటలపాటు పని చేస్తేనే ఇస్తామని మెలిక పెట్టడం విస్మ యాన్ని కలిగిస్తోంది. ఫలితంగా వేసవి అలవెన్స్ పొందే అవకాశం లేకుండా పోయిందనే వాదన వినిపిస్తోంది. తాగునీటికి, మజ్జిగకు, గడ్డపారకు, తట్టా బుట్టకు ఐదేసి రూపాయల చొప్పున ఇవ్వాల్సిన అల వెన్స్‌కు తుంగలో తొక్కింది.

కంప చెట్లే టెంట్లుగా...

ఉపాధి ప్రదేశాల్లో టెంట్లు ఏర్పాట్లు చేయకపోవడంతో కూలీ లకు కంపచెట్లు ఉపశమన కేంద్రాలుగా మారడం ఆందోళన కలిగిస్తోంది. సుమారు 45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతున్న నేపథ్యంలో ఎండల నుంచి ఉపశమనం పొందడానికి కంపచెట్లు నీడనిస్తుండడం గమనార్హం. ఇటీవల గోటూరు చెరువులో పని చేసిన జంగిట లక్ష్మమ్మ అనే మహిళ ఉపాధి పని నుంచి ఇంటికి వెళ్లిన తర్వాత మృతి చెందినట్లు తెలిసింది. 2014లో ఇచ్చిన టెంట్లు, కొరముట్లు మరమ్మతులకు గురవడం, మరమ్మతులకు ఒక్క రూపాయిని విడు దల చేయక పోవడం, వసతులను పర్యవేక్షించే మేట్లను తొల గించ డంతో వడదెబ్బల బారిన పడే అవకాశాలు ఉన్నాయనే వాదన విని పిస్తోంది.

పదేళ్లుగా పెరగని కూలి

2014 నుంచి ఉపాధి కూలి పెరుగుదలకు నోచుకోవడం లేదు. 2014లో ఉపాధి కూలి రూ.272 ఉండగా, పదేళ్ల అనంతరం రూ.272 ఉండడం గమనార్హం. వల్లూరు మండలంలో కనిష్టంగా రూ.120 నుంచి గరిష్టంగా రూ.180 వరకు పడుతుండడం విస్మ యాన్ని కలిగిస్తోంది. ఏటా 15 శాతం ధరలు పెరుగుతున్న నేప థ్యంలో ఉపాధి కూలి రూ.600 పెరగాల్సి ఉంది. వాస్తవంలో సగటు కూలిని పరిశీలిస్తే రూ.180 మించి పడడం లేదని తెలుస్తోంది.

వసతులు కల్పించండి

ఉపాధి పనుల దగ్గర వసతులు కల్పించాలి. ఉపాధి కూలిని పెంచుకునే అవకాశం ఉంటుంది. టెంట్లు, తాగు నీరు, మజ్జిగతోపాటు ప్రాణాధార ఔషదాలను అందుబాటులో ఉంచాలి.

- పెంచలమ్మ, వెంకటేశాపురం, వల్లూరు

ఉపాధి పనులే ఆధారం

ఉపాధి కూలి పనులే ఆధారంగా బతుకుతున్నాం. నిత్యావసరాల ధరల పెరుగుదలకు అనుగుణంగా ఉపాధి కూలిని పెంచాలి. పెరుగుతున్న ధరలతో బతుకడం కష్టంగా మారింది.

- వెంకటరమణ, ఓబాయపల్లి, వల్లూరు.

ఉపాధి హామీని బలోపేతం చేయాలి

ఉపాధి హామీ పథకాన్ని బలోపేతం చేయాలి. కూలీలు మొద లుకుని పదెకరాలు భూములు కలిగిన రైతులు సైతం ఉపాధి కూలి పనులకు వెళ్తున్నారు. ఇటువంటి పథకాన్ని మరింత పటిష్టంగా అమలు చేయడం ద్వారా కొనుగోలు శక్తి పెరుగుతుంది. ఫలితంగా జీవన ప్రమాణాలు మెరుగుపడే అవకాశం ఉంది.

- వి.అన్వేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి, కడప.

విత్తన సబ్సిడీ ఖరారు!

11,784 క్వింటాళ్ల పంపిణీకి కసరత్తు

వేరుశనగ 40, పచ్చిరొట్ట 50 శాతం

ఆర్‌బికెల్లో ఊపందుకున్న రిజిస్ట్రేషన్లు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ప్రభుత్వం ఖరీప్-2023 విత్తన సబ్సిడీని ఖరారు చేసింది. జిల్లా వ్యవసాయ శాఖ 11,784 క్వింటాళ్ల విత్తనాలకు ప్రతిపాదనలు అందజేసిన సంగతి తెలిసిందే. ప్రభుత్వం విత్తన సబ్సిడీ ధరలను ప్రకటించింది. బహిరంగ మార్కెట్‌లో కిలో వేరుశనగ కె6 రకపు విత్తనం రూ.93 ధర పలుకుతుండగా ప్రభుత్వం 40 శాతం సబ్సిడీ చొప్పున రూ.37.20 సబ్సిడీ భరించనుంది. వేరుశనగ కె6 రకం విత్తనాలను రూ.55.85 పంపిణీ చేయనుంది. జనుము, జీలగ విత్తనాల్ని 50 శాతం సబ్సిడీ చొప్పున విక్రయించనుంది. జీలగ విత్తనం బహిరంగ మార్కెట్‌లో రూ.79 పలుకుతుండగా రూ.39.50 సబ్సిడీ పోనూ, కిలో రూ.39. 50 విక్రయించనుంది. కిలో జనుము విత్తనం బహిరంగ మార్కెట్లో రూ.84 పలుకుతుండగా, రూ.42 సబ్సిడీపోగా కిలో జనుము విత్తనాన్ని రూ.42 పంపిణీ చేయనుంది. పిల్లిపెసర మార్కెట్లో రూ.97 పలుకుతుండగా కిలో పిల్లిపెసర విత్తనాన్ని 50 శాతం సబ్సి డీ చొప్పున రూ.48.50 సబ్సిడీపోగా, కిలో పిల్లిపెసర విత్తనాన్ని రూ.48.50 పంపిణీ చేయనుంది. జిల్లా వ్యాప్తంగా సబ్సిడీ విత్తన కొనుగోలుదారులు సంబంధిత ఆర్‌బికెల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ఊపందుకుంది. జిల్లా వ్యవసాయ శాఖ అధికార యంత్రాంగం రిజిస్ట్రేషన్ల ఆధారంగా జిల్లా కేంద్రం నుంచి లారీల్లో ఆర్‌బికెల పరిధిలోని రిజిస్ట్రేషన్ల ఆధారంగా పంపిణీ చేయడానికి అవసరమైన ఏర్పాట్లు చేసుకుంటోంది.

జిల్లాకు చేరిన యువగళం పాదయాత్ర

ప్రజాశక్తి-కడప ప్రతినిధి/జమ్మలమడుగు రూరల్/పెద్దముడియం

టిడిపి జాతీయ అధికార ప్రతినిధి నారా లోకేష్ యువగళం పేరుతో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన పాదయాత్ర మంగళవారం రాత్రి జిల్లాలోకి ప్రవేశించింది. నంద్యాల జిల్లా మీదుగా జిల్లాలోని జమ్మల మడుగు నియోజకవర్గం పెద్దముడియం మండలంలోని పెద్దపసుపుల గ్రామంలోనికి చేరుకుంది. నారా లోకేష్ పాదయాత్ర జిల్లాలోకి ప్రవేశిస్తున్న సందర్భంగా టిడిపి జిల్లా నాయకత్వం భారీగా స్వాగత సన్నాహాలు చేశారు. ఆయనకు ఘన స్వాగతం పలికిన అనంతరం జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, మైదుకూరు, కమలాపురం, కడప, రాయచోటి పాదయాత్ర షెడ్యూల్ స్పష్టత లభించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మంగళవారం రాత్రి ఎనిమిది గంటల అనంతరం పెద్ద పసుపుల గ్రామస్తులతో మాటామంతి నిర్వహించిన అనంతరం రాత్రికి బస చేయనున్నట్లు తెలుస్తోంది. మరుసటి రోజు బుధవారం నుంచి యథాతథంగా పాదయాత్రను చేపట్టనున్నారు. గురువారం మధ్యాహ్నం వరకు పాదయాత్రను కొనసాగించిన అనంతరం మహా నాడుకు బయల్దేరి వెళ్లనున్నట్లు సమాచారం. మంగళవారం సాయంత్రం ఆరు గంటలకు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బిటెక్ రవీం ద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జిల్లా పార్లమెంటు అధ్యక్షుడు మల్లేల లింగారెడ్డి టిడిపి కార్యాలయంకు చేరుకుని మాజీ ఎమ్మెల్సీ నారాయణరెడ్డి, నియోజకవర్గ ఇంఛార్జి భూపేష్‌రెడ్డితో కలిసి యువగళం పాదయాత్రపై చర్చించారు.

పాదయాత్రపై చర్చిస్తున్న జిల్లా నాయకులు

నిరసన తెలుపుతున్న డివైఎఫ్ఐ, ఐద్వా నాయకులు

కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలి

ప్రజాశక్తి - బద్వేలు

పట్టణంలోని కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ మార్కెట్ యార్డ్ వెనుక వీధులలో స్థానిక మహిళలతో కలిసి డివైఎఫ్ఐ, ఐద్వా, మహిళా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని మాట్లాడుతూ బద్వేల్ మున్సిపాలిటీగా ఏర్పడి దాదాపు 17 ఏళ్లు అవుతున్నా ఇంత వరకు వీధిలో డ్రైనేజ్ కాలువలు, సిమెంట్ రోడ్లు ఏర్పాటు చేయకపోవడం దారుణమని, వర్షాకాలం వీధులలో నడవాలంటే ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కాలనీ సమస్యలు సంబంధిత మున్సిపాలిటీ కమిషనర్, ప్రజాప్రతినిధులకు అనేక దపాలుగా తెలియజేసినప్పటికీ వారు పట్టించుకోకపోవడం చాలా దారుణమన్నారు. రాత్రి సమయంలో విధులో నడవాలంటే కంపచెట్లు పెరగడం వలన విష సర్పాలతో భయపడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఎలక్షన్ సమయంలో మా వీధిలోకి వచ్చినప్పుడు మీకు సిమెంట్ రోడ్లు డ్రైనేజ్ కాలవలు వీధిదీపాలు వేస్తామని అనేక మాయమాటలు చెప్పి తీరా ఓట్లు వేయించుకున్న తర్వాత ఈ వీధిలోకి వచ్చినటువంటి పాపాన పోలేదన్నారు. ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్, కమిషనర్ స్పందించి ఈ వీధిలో సిమెంట్ రోడ్లు డ్రైనేజ్ కాలువలు ఏర్పాటు చేయాలన్నారు. లేనిపక్షంలో వార్డులో ఉన్నటువంటి ప్రజలతో డివైఎఫ్ఐ యువజన సంఘం మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన పోరాటాలు చేపడతామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ పట్టణ నాయకులు గంగనపల్లి నాగార్జున, ఎస్ ప్రవీణ్ కుమార్, జీవీ రమణారెడ్డి, ఎస్కే మస్తాన్ షరీఫ్, సిఐటియు నాయకులు ఎం.నరసింహ, రాజగోపాల్, ఐద్వా మహిళా సంఘం నాయకులు అనంతమ్మ, బాలమ్మ, మోక్షమ్మ, మస్తాన్ బి, రాజి, మరియమ్మ, ప్రజలు పాల్గొన్నారు.

గోవర్ధనరెడ్డికి రూ.2 లక్షల సిఎస్ఆర్ నిధులు

కడప అర్బన్: యోగి వేమన విశ్వవిద్యాలయ రసాయన శాస్త్ర శాఖ సహ ఆచార్యులు డాక్టర్ పి.వసుగోవర్ధనరెడ్డి కి కార్పొరేట్ సోషియల్ రెస్పాన్సబిలిటీ కింద రూ.2 లక్షల నిధులను హైదరాబాద్ చెందిన ప్రముఖ ఫార్మసిటికల్ కంపెనీ డెనిస్కో కెమికల్ ప్రైవేట్ లిమిటెడ్ మంజూరు చేసింది. ఆ సంస్థ సిఇఒ డాక్టర్ కమలాకర్ నుంచి వచ్చిన లేఖను యోగి వేమన విశ్వవిద్యాలయం విసి ఆచార్య చింతా సుధాకర్ చేతుల డాక్టర్ వసు గోవర్ధన్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా విసి ఆయనను అభినందించారు. ఈ నిధులను పరిశోధనకు వినియోగించుకోవచ్చని సదరు సంస్థ సూచించింది. భావి పరిశోధకులకు ఆరు నెలల పాటు ఫెలోషిప్‌గా ఈ నిధులను వెచ్చించవచ్చని అభిప్రాయపడింది. వైవీయూ రసాయన శాస్త్ర శాఖకు చెందిన డాక్టర్ వసు గోవర్ధన్ రెడ్డి ఇదివరకే జర్మనీ దేశం నుంచి అలెగ్జాండర్ వాన్ హంబోల్డ్ అవార్డు, యూజిసి రామన్ పెలోషిప్, భారతదేశం నుంచి డీఎస్టీ యువ శాస్త్రవేత్త అవార్డులు రావడం పట్ల వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ చింతా సుధాకర్ హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ వై.పి.వెంకట సుబ్బయ్య. ప్రిన్సిపల్ ఆచార్య కె.కష్ణరెడ్డి, ఐక్యుఏసీ డైరెక్టర్ డాక్టర్ సుబ్రమణ్యం శర్మ పాల్గొన్నారు.

అంతర్జాతీయ సదస్సులో ప్రసంగం

కడప అర్బన్: సింగపూర్ వాబ్ క్రియేటివ్ కన్సల్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నాన్ యాంగ్ టెక్నో లాజికల్ విశ్వ విద్యాలయంలో అంతర్జాతీయ గ్లోబల్ సింపోసియంలో లోతైన అంతర్జాతీయ సహకారాలు అనే అంశంపై కెఎస్ఆర్ఎం కళాశాల సివిల్ ఇంజినీరింగ్ విభాగం సహ ఆచార్యులు పి.రాజేంద్ర కుమార్ ప్రసంగించారు. అంతర్జాతీయ సహకారం వల్ల సాదారణ, నిర్దిష్ట ప్రాంతాలపై విద్యార్థులకు, అధ్యాపకులకు ప్రాజెక్టులు, ఇంటర్న్‌షిప్‌లు, పారిశ్రామిక, పరిశోధన, అక్రిడిటేషన్ సంబంధిత సవవాళ్లతో కూడిన అంశాలపై దృష్టి సారించేందుకు వేదిక అవుతుందని పేర్కొన్నారు. యుఎస్ఎ ఎబిఇటి సిఇఒ డాక్టర్ మిచెల్ విల్లిగన్ చేతులు మీదుగా సర్టిఫికెట్ అందుకున్నారు. కళాశాల ఎమ్‌డి కందుల చంద్ర ఓబుళ్‌రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ వి.ఎస్.ఎస్.మూర్తి, సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఎన్.అమరనాథ్‌రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ప్రేమ్ కుమార్, వివిధ విభాగాల అధిపతులు అభినందించారు.

చిన్నారితో బావిలో దూకి తల్లి ఆత్మహత్య

ప్రజాశక్తి-గోపవరం

ఆ తల్లికి ఏమైందో తెలియదు కానీ ఐదేళ్ల కూమార్తె రాజాల రాజేశ్వరితో బావిలో దూకి రాజాల మంజుల(32) ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం మండలంలోని చెన్నవరంలో చోటుచేసుకుంది. పోలీసులు, రెవెన్యూ అధికారులు తెలిపిన వివరాల మేరకు... మండలంలోని చెన్నవరం ఎస్‌పి కాలనీకి చెందిన మంజుల నెల్లూరు జిల్లా అనాసాగరం మండలం మంచాలపల్లె గ్రామానికి చెందిన వ్యక్తితో వివాహం జరిగింది. వారం రోజులు కిందట అన్నవరం గ్రామానికి మంజుల, ఆమె భర్త, పిల్లలు వెళ్లారు. అక్కడ ఏమి జరిదిందో తెలియదు కానీ మంజుల, ఆమె కుమార్తె రాజేశ్వరి వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నారు. ఈ విషయం తెలిసిన వెంటనే బద్వేల్ రూరల్ ఎస్ఐ చంద్రశేఖర్, ఫైర్ అధికారి, గోపవరం తహశీల్దారు దామోదర్‌రెడ్డి, తదితర పోలీసు సిబ్బంది, ఫైర్ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. చెన్నవరం గ్రామంలోని వ్యవసాయ బావిలో మంజుల, రాజేశ్వరి మృతదేహాలను వెలికితీశారు. ఆత్మహత్యకు దారి తీసిన పరిస్థితులపై పోలీసులు విచారణ చేస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రూరల్ ఎస్ఐ పేర్కొన్నారు.

మృతులు మంజుల, రాజేశ్వరి

జగన్ సొంత జిల్లాకు అన్యాయం

టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర జిల్లాకు చేరుకుందని, బుధవారం జమ్మలమడుగు నియోజకవర్గం నుంచి ప్రొద్దుటూరు, మైదుకూరు, కడప వరకు పాదయాత్ర కొనసా గుతుందని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. పాదయాత్ర వివరాలను మంగళవారం గాయత్రీ టవర్స్‌లో విలేకరుల సమావేశంలో వెల్లడించారు. గత ముఖ్యమంత్రులు వారి వారి జిల్లాలను ఎంతగానో అభివద్ధి చేశారని, జిల్లా వాసిగా ముఖ్యమంత్రి అయిన జగన్ జిల్లాకు తీరని అన్యాయం చేశారని మండిపడ్డారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించే దిశగా ఒక్క పరిశ్రమను ఏర్పాటు చేశారా అని ప్రశ్నించారు. ఉన్న పరిశ్రమలను ముప్పు తిప్పలు పెట్టి ఎల్లలు దాటించారని విమర్శించారు. అకాల వర్షాలకు దెబ్బతిన్న అరటి, చీని రైతుల గోడు పట్టించుకున్న పాపాన పోలేదని అన్నారు. ఇసుక, మట్టి, ఎర్రచందనం అమ్ముకుని సొమ్ము చేసుకోవడంపై ఉన్న శ్రద్ధ ఆ పార్టీ నేతలకు ప్రజా సంక్షేమంపై లేదని పేర్కొన్నారు. వైఎస్ వివేక హత్య నేరారోపణ లో ఉన్న ఎంపి అవినాష్ రెడ్డి చట్టానికి సహకరించి, తప్పు చేయలేదని కోర్టులో నిర్దోషత్వాన్ని నిరూపించుకోవాలన్నారు. నారా లోకేష్ యువ గళం పాదయాత్ర విజయవంతం చేయాలని టిడిపి శ్రేణులను కోరారు.

మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

ఎంపీ అవినాష్ డ్రామాలు పార్టీకి నష్టమే : బీటెక్ రవి

ఎంపీ అవినాష్‌రెడ్డి సిబిఐ నుంచి తప్పించుకునే డ్రామాలు ఆ పార్టీకి నష్టాన్ని చేకూర్చుతుందని, తెలిసే ఆయన తల్లికి ఆరోగ్యం బాగాలేదని డ్రామాలు అన్నారు. జగన్ రెడ్డి, అవినాష్ రెడ్డి అక్రమ సంపాదన రూ.2000 నోట్ల రూపంలో దాగి ఉందని, మార్పు సమయాన్ని సద్వినియోగం చేసుకోలేం అన్న సందేహంలో వారిరువురూ ఉన్నారని అన్నారు. అవినాష్ కు అరెస్టు భయం లేకపోతే ఎక్కడ ఆసుపత్రిలో లేనట్లు, వైద్యం చేయించే స్తోమత లేనట్లు కర్నూల్ లోనే ఆయన తల్లిని ఎందుకు ఉంచారని ప్రశ్నించారు. రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరి ప్రసాద్ మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చాక ఏడుసార్లు విద్యుత్ ఛార్జీలు పెరిగాయన్నారు. ప్రజలపై భారం మోపి, ఉచిత పథకాల పేరుతో ఈ ప్రభుత్వం ప్రజలను మభ్యపె డుతుందని చెప్పారు. అనంతరం ముఖ్యమంత్రి మనవాడే అభివద్ధిలో వెనకడుగు గోడపత్రాలను విడుదల చేశారు. సమావేశంలో ప్రొద్దుటూరు ప్రవీణ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

తొల్లగంగన్నపల్లెలో నకిలీ పట్టాల కలకలం

ప్రజాశక్తి -వల్లూరు

మండలంలోని తొల్లగన్నపల్లె గ్రామ పొలంలోని సర్వేనెంబర్ 58/4లో కొందరు వ్యక్తులు నకిలీ డిఫారాలు తయారు చేసి వాటి ఆధారంగా అమ్మకాలు జరిపి సొమ్ము చేసుకున్నారు. టక్కోలు లక్ష్మీదేవి, చిన్న కృష్ణారెడ్డి, టక్కోలు వెంకట సుబ్బారెడ్డి, రోషిరెడ్డి, ఎర్రమాచి రామచంద్రారెడ్డి, బొల్లవరం రామలక్ష్మ, గురుస్వామి బొల్లవరం విజయలక్ష్మి, వీరభద్రుడు, ఎర్రమాచి రామచంద్రారెడ్డి, స్వర్ణలత, మరి కొన్ని పేర్లతో దొంగ ఫారాలు సృష్టించి రమణారెడ్డి అనే వ్యక్తి రూ.20 లక్షలు సొమ్ము చేసుకున్నాడని బాధితుడు సునీల్ ఎస్పీకి ఫిర్యాదు చేయడంతో వెలుగులోకి వచ్చాయి. నాలుగు రోజుల నుంచి తహశీల్దార్ కార్యాలయం చుట్టూ విలేకరులు వివరణ కోసం తిరుగుతున్నా సమాధానం ఇవ్వని తహశీల్దార్ మంగళవారం సాయంత్రం పత్రిక ప్రకటన అందించారు. ఈ ప్రకటనలో తహశీల్దార్ అమరేశ్వరి వల్లూరు మండలంలోని తొల్లగంగనపల్లె గ్రామ పొలంలో సర్వే నెంబర్ 58/4లో కొందరు వ్యక్తులు ఉన్న నకిలీ డిఫారాలు తయారు చేసి వాటి ఆధారంగా చూపుతూ అమ్మకాలు చేస్తున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. సదరు సర్వేనెంబర్ ప్రభుత్వ భూమి కావున సదరు సర్వేనెంబర్‌కు సంబంధించి నకిలీ డిఫారాలు తయారు చేసిన వారిపై చట్టపరంగా క్రిమినల్ కేసు నమోదు చేయిస్తామన్నారు. ఇంత తతంగం జరిగినప్పటికీ తమకేమీ తెలియనట్లు వ్యవహరిస్తున్న రెవెన్యూ సిబ్బంది ఇప్పటికైనా జిల్లా అధికారులు విచారణ చేపట్టి తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు. రెవెన్యూ అధికారుల హస్తము లేనిదే ఇంత తతంగం జరుగుతుందా ఈ వ్యవహారంలో భారీగానే ముడుపులు చేతులు మారినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. తొల్లగంగన పల్లెలో ఇవేకాక ఇంకా భారీగా అక్రమాలు జరిగాయని వినికిడి. దీనిపై ఉన్నతాధికారులు విచారణ చేస్తే ఇంకా అక్రమాలు భారీగా వెలుగు చూసే అవకాశం ఉందని స్థానికులు చర్చించుకుంటున్నారు.

నకిలీ పట్టాలు తయారు చేసిన ప్రభుత్వ భూమి

'కేతు'కు పలువురి నివాళులు

ప్రజాశక్తి - కడప అర్బన్

సాహితీ మకుటం, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత కేతు విశ్వనాథరెడ్డి భౌతికకాయం ఒంగోలు నుంచి కడప సింగపూర్ టౌన్‌షిప్‌లోని కేతు స్వగృహానికి మంగళవారం మధ్యాహ్నం చేరుకుంది. అభిమానుల సందర్శనార్థం బుధవారం ఉదయం ఏడు గంటలకు వరకు పార్థివ దేహాన్ని అక్కడే ఉంచుతారు. అక్కడి నుంచి కేతు సొంత గ్రామమైన ఎర్రగుంట్ల మండలం, చిలంకూరు దగ్గరలోని రంగశాయిపురానికి ఉదయం 9 గంటలకు తీసుకువెళతారు. అక్కడే దహన సంస్కారాలు ఉంటాయని కుటుంబ సభ్యులు తెలిపారు. కేతుకు జిల్లా వ్యాప్తంగా ఉన్న పలువురు సాహితీ వేత్తలు, పలు పార్టీలకు చెందిన నాయకులు ఘనంగా నివాళులర్పించారు. కేతుకు నివాళులర్పించడానికి సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ బుధవారం ఉదయం కడప సింగపూర్ టౌన్ షిప్‌లో ఉన్న కేతు విశ్వనాథరెడ్డి స్వగృహానికి చేరుకుంటారు. విశ్వనాథరెడ్డి పార్థీవదేహానికి సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ నివాళి అర్పించారు. కేతు మృతి సాహితీ లోకానికి తీరని లోటని తెలిపారు. ఎల్ఐసి ఎంప్లాయిస్ యూనియన్ కడప డివిజన్ అధ్యక్షులు అవదానం శ్రీనివాస్, కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి, ఎల్ఐసి ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షులు అక్బర్ బాష, సంయుక్త కార్యదర్శి కె.సి.ఎస్.రాజు, నాయకులు జయచంద్ర, మహేశ్వరరెడ్డి, పి.జిఎస్.యూనిట్ కార్యదర్శి సుబ్బారెడ్డి, ఇతర ఉద్యోగ సంఘాల నాయకులు వెంకటరామరాజు, రామాంజులరెడ్డి, నరసింహారెడ్డి నివాళులర్పించారు. ఎపి ప్రభుత్వ విశ్రాంతి ఉద్యోగుల సంఘం కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రామమూరి నాయుడు ఆధ్వర్యంలో కేతు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గానుగపెంట హనుమంతరావు, వెల్లాల వెంకటేశ్వరచారి, సభ్యులు పాల్గొన్నారు.

కమీషన్ల కోసమే విద్యుత్ కృత్రిమ కొరత : టిడిపి

ప్రజాశక్తి-కడప అర్బన్

ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి కమీషన్లకు కక్కుర్తిపడి విద్యుత్ ఛార్జీలు పెంపు, విద్యుత్ కోతలు పెరిగాయని టిడిపి జిల్లా అధ్యక్షులు లింగారెడ్డి విమర్శించారు. మంగళవారం శంకరాపురం విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట కడప నియోజకవర్గ ఇన్‌ఛార్జీ అమీర్ బాబు అధ్యక్షతన నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా లింగారెడ్డి మాట్లాడుతూ సిఎం లూఠీ, అవినీతి కారణంగా విద్యుత్ వినియోగదారులపై రూ.57,188 కోట్లు భారాలు మోపారని విమ ర్శించారు. క్విడ్ ప్రోకోలకు ప్రభుత్వ విద్యుత్ సంస్థల్లో వాటి సామర్థ్యం మేరకు ఎందుకు విద్యుత్ ఉత్పత్తి చేయడం లేదని ప్రశ్నించారు. కమీషన్ల కోసం కృత్రిమ కొరత సృష్టిస్తూ బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలకు రూ.12వేల కోట్లకు పైగా ఖర్చు చేశారని విమర్శించారు. ఎంపి అవినాష్‌రెడ్డి బినామీ కంపెనీ షిర్డీ సాయి ఎలక్ట్రికల్ వద్ద రూ.60 వేలు ధర ఉన్న ట్రాన్స్ ఫార్మర్లకు రూ.1.30 లక్షలకు ఎందుకు కొంటున్నారని ప్రశ్నించారు. విద్యుత్ కోతలు లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. విద్యుత్ కొనుగోళ్ల అవినీతిపై, ఒప్పందాలపై విచారణ సంఘం ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. అమినీతి కోసం పెడుతున్న మోటార్లకు మీటర్లు ఉపసంహరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు గోవర్ధన్‌రెడ్డి, హరిప్రసాద్, సీనియర్ నాయకులు లక్ష్మిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరి, నగర అధ్యక్షులు సానపురెడ్డి శివకొండారెడ్డి, ప్రధాన కార్యదర్శి జయకుమార్, నాయకులు శివరామ్, సుబ్బరాయుడు, రవిశంకర్‌రెడ్డి, రామప్రసాద్, నాసర్ అలీ, మాసా కోదండరామ్, శ్రీనివాసులు, జియావుద్దీన్, మేకల వెంకటేష్, ప్రేమకుమార్, మహమ్మద్, సురేష్, సుబ్బరాయుడు, జనార్ధన్‌రెడ్డి, భరత్, శ్రీనివాసులు, అంజి, వరదా కిరణ్, సుధాకర్ యాదవ్, రమేష్‌బాబు, పార్వతి పాల్గొన్నారు.

సబ్ స్టేషన్ ఎదుట నిరసనలో టిడిపి నాయకులు

రాష్ట్ర కాపునాడు అధ్యక్షునికి స్వాగతం

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప ఎయిర్ పోర్ట్‌లో కాపుడు రాష్ట్ర అధ్యక్షులు నారాయణ స్వామి రాయల్‌కు జిల్లా అధ్యక్షులు సగినాల శ్రీనివాసులు, పులివెందుల బలిజ సంఘం అధ్యక్షులు ప్రసాద్, జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి రెడ్డిపల్లి మహేష్ ఘన స్వాగతం పలికి, సన్మానం చేశారు. ఈ సందర్భంగా నారాయణ స్వామి మాట్లాడుతూ హైదరాబాదులో మోకాళ్ల సర్జరీ చేయించుకుని రెండు నెలల తరువాత కడపకు వచ్చానని పేర్కొన్నారు. కాపునాడు సభ్యుల ఆధారభిమానులు మరువలేమన్నారు. కార్యక్రమంలో పులివెందుల బలిజ సంఘం అధ్యక్షులు ప్రసాద్, జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి రెడ్డిపల్లి మహేష్ పాల్గొన్నారు.

నారాయణ స్వామికి స్వాగతం పలుకుతున్న కాపుడునాడు నాయకులు

స్థలాన్ని పరిశీలిస్తున్న జెసి గణేష్‌కుమార్, ఆర్‌డిఒ

గురుకుల పాఠశాల స్థల పరిశీలన

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

మండలంలో గురుకుల పాఠశాల నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని మంగళవారం జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్, ఆర్‌డిఒ వెంకటేష్ పరిశీలించారు. రచ్చుమారిపల్లిలో స్వామి నారాయణ గురుకుల విద్యాలయం కోసం సర్వే నంబర్ 69, 70, 71, 72లో 11.92 ఎకరముల భూమిని పరిశీలించారు. తహశీల్దార్ మాధవకృష్ణారెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నూతన సిఇని కలిసిన యూనియన్ నాయకులు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

సిఇ నాగరాజును సన్మానిస్తున్న యూనియన్ నాయకులు

ఆర్‌టిపిపి నూతన చీఫ్ ఇంజనీర్‌గా బాధ్యతలు చేపట్టిన నాగరాజును మంగళవారం ఆంధ్రప్రదేశ్ పవర్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నపూస సుబ్బిరెడ్డి, యూనియన్ స్థానిక నాయకత్వం మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన చీఫ్ ఇంజనీర్‌తో సుబ్బిరెడ్డి మాట్లాడుతూ పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కార్మికుల అనేక సమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపాలన్నారు. ఇందుకు సిఇ స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పి.గిరిబాబు, యస్.జి శేఖర్, యం.నరసింహులు, ఎ.హమీద్, గంగరాజు, జి.చంద్రశేఖర్, డి.పుల్లారెడ్డి, రమణ పాల్గొన్నారు.

ఎస్‌టిఎఫ్ ముద్దనూరు మండల శాఖ ఎన్నిక

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యాయ ఫెడరేషన్ ముద్దనూరు మండల శాఖ అధ్యక్షులుగా షేక్ హుస్సేన్ పీరా, ప్రధాన కార్యదర్శిగా పట్నం మునిశేఖర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆ మేరకు ఆ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరాజు యాదవ్ తెలిపారు. స్థానిక పెన్షనర్స్ హోమ్‌లో మంగళవారం ఎస్‌టిఎఫ్ జమ్మలమడుగు డివిజన్ ఉపాధ్యాయుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సుబ్బరాజు యాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం త్వరలో జరగబోయే ఉపాధ్యాయ బదిలీలను పారదర్శకంగా నిర్వహించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం హామీల్లో భాగంగా ఇచ్చిన సిపిఎస్ రద్దును ప్రకటించి, ఉద్యోగ, ఉపాధ్యాయులందరికీ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. బదిలీల తర్వాత రెండు ఇంక్రిమెంట్లుతో కూడిన ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. మండల శాఖ ఎన్నికల పరిశీలకులుగా రాష్ట్ర నాయకులు విద్యాసాగర్ వ్యవహరించారు. ఎస్‌టిఎఫ్ నాయకులు వెంకటసుబ్బయ్య, అజయ్‌కుమార్, సుబ్బయ్య, లక్ష్మీచౌడయ్య పాల్గొన్నారు.

షేక్ హుస్సేన్, పట్నం మునిశేఖర్

జగనన్న ఆణిముత్యాల అవార్డుకు సమీరా ఎంపిక

ప్రజాశక్తి - వేంపల్లె



స్థానిక ఉర్దూ జూనియర్ కళాశాలకు చెందిన సమీరా అనే విద్యార్థి జగనన్న ఆణిముత్యాల ఆవార్డుకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ హబీ బుల్లా తెలిపారు. సీనియర్ ఇంటర్ ఎంపిసి విభాగంలో సమీరా అనే విద్యార్థి 948 మార్కులు సాధించడంతో ఈ అవార్డుకు ఎంపికయ్యారన్నారు. ఈనెల 25న పులివెందులలోని అహెూ బిలపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థితోపాటు తల్లిదండ్రులను సన్మానించనున్నట్లు తెలిపారు. విద్యార్థికి అవార్డు కింద రూ.15 వేలు నగదు ప్రోత్సాహక బహుమతిని అందజేయనున్నట్లు తెలిపారు. భవిష్యత్‌లో ఇలాంటి అత్యుత్తమ మార్కులు సాధించేందుకు ప్రత్యేకకృషి చేస్తామని తెలిపారు. కళాశాల స్థాపించిన అనతి కాలంలోనే జిల్లా, రాష్ట్రస్థాయిలో మంచి ప్రతిభను చూపడం ఆనందంగా ఉందన్నారు.

క్రైం కార్నర్

మృతి చెందిన ఎల్లయ్య

నీటిలో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ప్రమాదవశాత్తూ నీటిలోపడి మంగళవారం బందెల ఎల్లయ్య(45) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కమలాపురం మండలం పెద్ద చెప్పలి గ్రామానికి చెందిన ఎల్లయ్య ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తూ జీవనం సాగించేవాడు. ఆయన పదేళ్ల క్రితం జీవనోపాధి నిమిత్తం పులివెందులలోని ప్రశాంతినగర్‌లో ఉంటున్నాడు. కూలి కోసం కోళ్లను వ్యాన్‌లో లోడ్ చేడయం, అన్‌లోడ్ చేయడం. అలాగే మంగళవారం అన్‌లోడ్ చేసి తిరిగి వస్తుండగా పులివెందులలోని రాణితోపు వెనుక ఉన్న లింగాల కుడి కాలువలో కాళుల కడుక్కునేందుకు నీటిలో దిగుతూ ప్రమావశాత్తూ అందులో పడిపోయాడు. ఎల్లయ్యను కాపాడేందుకు మరోవ్యక్తి ప్రయత్నించినా ఫలితం లేదు. ఆ దారిన వెళుతున్న మరో వ్యక్తి సాయంతో మల్లయ్యను బయటకు తీశారు. అప్పటికే ఆయన మృతి చెందాడు. సంఘటనపై ఎల్లయ్య భార్య రాజమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ హుస్సేన్ తెలిపారు.

గొడవ కేసులో ఏడాది జైలు శిక్ష : రూ.50 వేలు జరిమానా

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పట్టణ పరిధిలో 2016లో పొలం దారి విషయంలో జిల్లెల శ్రీనివాసులురెడ్డి, చెమికల చంద్రశేఖర్‌రెడ్డిపై జిల్లెల్ల చంద్రశేఖర్‌రెడ్డి అనే వ్యక్తి రాళ్లతో దాడి చేసి గాయపరచడంతో అప్పటి ఎస్‌ఐ లక్ష్మీనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఆ కేసుకు సంబంధించి ఎస్‌ఐ లక్ష్మీనారాయణ ఆధారాలను కోర్టుకు సమర్పించడంతో ప్రొద్దుటూరు అసిస్టెంట్ సెషన్ జడ్జి శివప్రసాద్ యాదవ్ జిల్లెల్ల చంద్రశేఖర్‌రెడ్డికి ఏడాది జైలు శిక్ష, రూ.50 వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. జరిమానా కట్టలేని పక్షంలో అదనంగా రెండు నెలలు జైలు శిక్ష అనుభవించేలా తీర్పునిచ్చారు. ఈ సందర్భంగా దర్యాప్తు చేసిన ఎస్‌ఐ లక్ష్మీనారాయణను, సాక్షులను, నిందితులను సకాలంలో కోర్టుకు హాజరు పరిచిన సిఐ మంజునాథరెడ్డిని, ప్రభుత్వ లాయర్ ఓబులేసును ఎస్‌పి అన్బురాజన్ అభినందించారు.

రూ.30 వేలు విషయమై ఘర్షణ

- ఇరువురికి గాయాలు, రెండు బైకులు దగ్ధం

తీవ్రంగా గాయపడిన వినోద్ | రత్నాకర్ ఇంటివద్ద దగ్ధమవుతున్న బైకులు | దాడిలో చెల్లాచెదురుగా పడిన వస్తువులు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

రూ.30వేలు డబ్బు విషయమై జరిగిన ఘర్షణలో ఇరువురు గాయపడగా, రెండు బైక్‌లు దగ్ధమైన సంఘటన మంగళవారం పులివెందుల నగరిగుట్టలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి.. తనకు రూ.30,000 డబ్బులు ఇవ్వాలని వినోద్ మంగళవారం రత్నాకర్ అలియాస్ గుల్లోడుని అడిగేందుకు అతని ఇంటి దగ్గరకు వెళ్లాడు. అక్కడ మాటమాట పెరిగి వారిమధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఒకరినొకరు కొడవలితో దాడి చేసుకున్నారు. ఈ సంఘటనలో వినోద్ వీపు, తలపై నరకడంతో తీవ్ర గాయాలయ్యాయి. అలాగే రత్నాకర్ వద్ద ఉన్న వ్యక్తి మణి తలపై గాయాలయ్యాయి. వీరిద్దరినీ చికిత్స కోసం పులివెందుల ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం వినోద్‌ను ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న వినోద్ వర్గీయులు హాస్పిటల్ వద్దకు చేరుకొని సంఘటనకు పాల్పడిన రత్నాకర్ ఇంటి దగ్గరికి వెళ్లి అక్కడ ఉన్న బుల్లెట్, స్కూటీకి నిప్పంటించారు. మరో రెండు వాహనాలను కర్రలతో పగలగొట్టారు. ఇళ్లల్లో ఉన్న ఫర్నీచర్, అద్దాలను పగలగొట్టారు. అక్కడి నుంచి ఇంకో ఇంటి దగ్గరికి వెళ్లి ఫర్నీచర్, ఇంటి తలుపులను బద్దలు కొట్టి ఇంట్లో సామాన్లు చెల్లాచెదురువేశారు. విషయాన్ని తెలుసుకున్న ఎస్‌ఐ హుస్సేన్, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని అదుపు చేశారు. అక్కడ తిరుగుతున్న ఇద్దరిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లారు. స్థానికుల సమాచారం మేరకు.. సోమవారం రాత్రి ఆరు మంది రత్నాకర్ ఇంటి దగ్గరికి వచ్చారు. మళ్లీ మంగళవారం మధ్యాహ్నం కొంతమంది వచ్చి రత్నాకర్‌తో వాగ్వాదం చేశారు. రత్నాకర్ వద్ద ఉన్న మణి అనే వ్యక్తిని అనవసరంగా కొట్టారని, దీనిపై రత్నాకర్ వచ్చి ఎందుకు కొడుతున్నారని అడిగేలోపు అతడిని కూడా కొట్టుకుంటూ లోపలికి వెళ్లారు. దాడికి పాల్పడిన వారి దగ్గర కొడవలి ఉండిందని, దాంతో మణిని కొడతానే వెంటనే రత్నాకర్ కూడా వారిపై దాడి చేశారని స్థానికులు అంటున్నారు. ఈ సంఘటన జరగడానికి ముఖ్య కారణం బెట్టింగ్ విషయమేనా అని స్థానిక ప్రజలు చర్చించుకుంటున్నారు.

సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ హుస్సేన్

త్వరలో రైతుల ఆధారాలు పంపాలి

ప్రజాశక్తి - చాపాడు

జిల్లాలో నూతనంగా నాలుగు లైన్ల గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని, అందులో భాగంగా మండల పరిధిలో భూములు కోల్పోయిన రైతులు వీలైనంత త్వరగా ఆధారాలు అందజేయాలని జమ్మలమడుగు ఆర్‌డిఒ శ్రీనివాసులు సూచించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం తహశీల్దార్, విఆర్‌ఒలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో అనంతపురం, బూడిదపాడు, కుచ్చుపాప, అల్లాడుపల్లె, సోమాపురం, పిచ్చపాడు రెవెన్యూ గ్రామాల పరిధిలో గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణం కోసం భూ సేకరణ చేపడుతున్నామన్నారు. ఆంధ్ర, కర్ణాటక సరిహద్దులోని అనంతపురం జిల్లా కోడికొండ వద్ద హైదరాబాద్– బెంగళూరు 44వ జాతీయ రహదారి నుంచి చెన్నై హైవేపైకి నూతనంగా నాలుగు లైన్ల గ్రీన్ ఫీల్డ్ ఎక్స్ ప్రెస్ వే నిర్మాణం చేపట్టేందుకు నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా చర్యలు తీసుకుంటున్నదన్నారు. పాత రోడ్డు కాకుండా పూర్తిగా నూతన నాలుగు లైన్ల రోడ్డు నిర్మించేందుకు చర్యలు చేపడుతుందన్నారు. ఈ హైవే నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులు ఇప్పటికే ఆధారాలు సమర్పించారని, ఇంకా ఆధారాలు ఇవ్వని రైతులు వెంటనే తమ సిబ్బందికి అందజేయాలని సూచించారు. రూ.32 కోట్లు భూసేకరణకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. ఇప్పటికే కొంతమంది రైతులకు డబ్బు జమ అయిందన్నారు. రెవెన్యూ సిబ్బంది రైతుల నుండి ఆధారాలు సేకరించి వెంటనే రైతులకు నగదు జమ అయ్యేలా చూడాలన్నారు. మూడు రోజులపాటు పూర్తిగా హైవే భూముల ఆధారాలు సేకరించే పనిలో ఉండాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ సుభాని, ఆర్‌ఐ లక్ష్మీకాంతమ్మ, విఆర్‌ఒలు, సిబ్బంది పాల్గొన్నారు.

రాజ్యాంగపరంగా నడుచుకోవాలి

మాట్లాడుతున్న సిఐ నారాయణ యాదవ్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రజలందరూ రాజ్యాంగపరంగా నడుచుకోవాలని త్రీటౌన్ సిఐ నారాయణ యాదవ్ సూచించారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సమ్మర్‌క్యాంపు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా విద్యార్థులు ఫీల్డ్‌విజిట్‌లో భాగంగా మంగళవారం త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. జెవివి గౌరవ సలహాదారులు సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ప్రజల ధనమాన రక్షణ కోసం పోలీస్ విధులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సిఐ మాట్లాడుతూ పోలీసులు 24 గంటలూ ప్రజలకు అందుబాటులో ఉంటారన్నారు. అవసరమైన వారు ఏక్షణంలో అయినా 100కు ఫోన్ చేసి పోలీస్‌సేవలను పొందవచ్చన్నారు. అవసరమైన సమయాల్లో మహిళలు దిశ యాప్‌ను ఉపయోగించాలని కోరారు. పోలీస్‌స్టేషలోని వైర్‌లెస్ సిస్టమ్ పనితీరు, ఎఫ్‌ఐఆర్ గురించి వివరించారు. సమాజం గురించి విద్యార్థుల్లో అవగాహన పెంచేందుకు జెవివి నిర్వహిస్తున్న కార్యక్రమాలపై సిఐ సంతృప్తి వ్యక్తం చేస్తూ జెవివిని అభినందించారు. కార్యక్రమంలో జెవివి రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, ప్రధాన కార్యదర్శి సునీత, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హుల గుర్తింపు బాధ్యత వాలంటీర్లదే

ప్రజాశక్తి - చాపాడు

సంక్షేమ పథకాల అమలు, అర్హుల గుర్తింపు బాధ్యత పూర్తిగా వాలంటీర్లదేనని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి తెలిపారు. స్థానిక ఎంపిడిఒ సభాభవన ఆవరణలో మంగళవారం వాలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చిందన్నారు. ప్రతి 50 కుంటుంబాలకు ఒక వాలంటీర్‌ను నియమించి ప్రజల వద్దకే పాలన తీసుకొచ్చారన్నారు. ముఖ్యమంత్రి ఈ వ్యవస్థపై నమ్మకం ఉంచి పాలన సాగిస్తున్నారని తెలిపారు. అనంతరం బద్రిపల్లెకు వాలంటీర్ జి.లక్ష్మి శకుంతలకు సేవ వజ్రం, పల్లవోలుకు చెందిన పి.శశికుమార్, ఎం.వరలక్ష్మి, ఖాదర్‌పల్లెకు చెందిన ఎస్.చాంద్‌మున్ని, ఎన్ ఓబాలయపల్లెకు చెందిన ఎస్.పరమేష్, అయ్యవారిపల్లికు చెందిన ఉస్మాన్లకు సేవ రత్నం అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి టి.లక్షుమయ్య, ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు, ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి, వైసిపి మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ల కన్వీనర్ రామ్మోహన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ ఎస్ఆర్ బాలనరసింహారెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, గంగులయ్య, జయరామిరెడ్డి, వినయ్‌కుమార్‌రెడ్డి, వెంకటరెడ్డి, మాధవ్‌రెడ్డి, రామాంజనేయులరెడ్డి, ఓబుళరెడ్డి, కిషోర్ కుమార్‌రెడ్డి, వెంకటసుబ్బయ్య, వెంకటేశ్వర్‌రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, వీరారెడ్డి, గంగులయ్య, హాజరత్‌రెడ్డి, బోలోరో బాషా పాల్గొన్నారు.

సేవా వజ్రకు ఎంపికైన వాలంటీర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

25 నుంచి సెమిస్టర్ పరీక్షలు

ప్రజాశక్తి - కడప అర్బన్

డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 25 నుంచి ప్రారంభమవుతాయని విసి, పరీక్షల నిర్వహణాధికారి బి.ఆంజనేయ ప్రసాద్, రిజిస్ట్రార్ ఇ.సి.సురేంద్రనాథరెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. జూన్ 2 వరకు పరీక్షలు కొనసాగుతాయని తెలిపారు. స్కూల్ ఆఫ్ ప్లానింగ్‌లోని టౌన్ ప్లానింగ్, బిల్డింగ్ టెక్నాలజీస్, ఇంటీరియల్ డిజైన్, కాలేజి ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ లోని పెయింటింగ్, ఫొటోగ్రఫీ, అప్లైడ్ ఆర్ట్, యానిమేషన్, స్కల్చర్ విభాగాలకు పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు.

ఎంఒయు కుదుర్చుకున్న ఫైన్ ఆర్ట్స్ యూనివర్శిటీ

ప్రజాశక్తి - కడప అర్బన్

డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్శిటీ స్కూల్ ఆఫ్ ప్లానింగ్ ఆర్కిటెక్చర్ విజయవాడతో 5 సంవత్సరాల పాటు అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. విసి ఆంజనేయ ప్రసాద్, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ ఆర్కిటెక్చర్ డైరెక్టర్ ప్రొఫెసర్ కొండా రమేష్ ఆధ్వర్యంలో ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు.

ఆప్ సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి - కడప అర్బన్

ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ సాజిద్ హుస్సేన్ ఆధ్వర్యంలో మంగళవారం సభ్యత్వనమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఢిలీ తరహాలో ఎపిలో పార్టీ మ్యానిఫెస్టో అమలు చేస్తారని తెలిపారు. ప్రజలను అభివృద్ధి పరిచే ఏకైక లక్ష్యం అరవింద్ కేజ్రివాల్ నాయకత్వంలోని ఆప్ పని అన్నారు. ప్రతి ఒక్కరూ పార్టీ సభ్యత్వం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త సహాయ కార్యదర్శి దస్తగిరి, జిల్లా కో–ఆర్డినేటర్ రహమతుల్లా, సీనియర్ నాయకులు డాక్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

నగరంలో విరివిగా మొక్కలు పెంచాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలో ఆర్‌టిసి బస్టాండ్ నుంచి వై జంక్షన్ వరకు ఉన్న గార్బేజ్ పాయింట్లు తొలగించాలని నగర పాలక సంస్థ కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్ చంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సంజన్న సర్కిల్ నుంచి వైఎస్ఆర్ సర్కిల్ వరకు డివైడర్లను ఏర్పాటు చేసి మొక్కలు పెంచాలని చెప్పారు. బహుజన్ నగర్ ప్రాంతంలో రోడ్లు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. సాగర్ కాలనీలో మసీదు ఎదురుగా రోడ్ల నిర్మాణ పనులను చేపట్టాలని తెలిపారు. వందశాతం చెత్త స్వీకరణ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

27న తలనీలాల వేలం

ప్రజాశక్తి - వేంపల్లె

శ్రీవృషభాచలేశ్వర దేవస్థానానికి చెందిన తలనీలాలు ప్రోగు చేసుకొనుటకు ఈనెల 27న ఉదయం 11గంటలకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారి శ్రీధర్, చైర్మన్ వెంకటేష్ తెలిపారు. దేవదాయశాఖ అధికారుల ఆధ్వర్యంలో వేలం ఏర్పాటు చేశామన్నారు. అలాగే స్వామి కల్యాణమండపం రెండేళ్లపాటు లీజుకు ఇచ్చేందుకు కూడా బహిరంగ వేలం వేస్తున్నట్లు చెప్పారు. వేలం పాటలో పాల్గొనే వారు కల్యాణ మండపానికి రూ.50 వేలు సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాల్సి ఉందన్నారు. తల నీలాలకు రూ.10వేలు డిపాజిట్ చెల్లించాలని వివరించారు. ఏ ప్రాంతం వారైనా హాజరుకావచ్చన్నారు. అన్యమతస్తులు పాల్గోనరాదన్నారు.

జగనన్న ఇళ్లు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

జగనన్న ఇళ్లు నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కార్పొరేషన్ కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్ చంద్ ఆదేశించారు. మంగళవారం కొప్పర్తి లే ఔట్,లో కార్యదర్శులు, స్పెషల్ ఆఫీసర్లు, నోడల్ ఆఫీసర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హౌసింగ్ విభాగ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, అసిస్టెంట్ ఇంజినీర్లు ప్రజలకు సహకరించాలని తెలిపారు. వారికి కావాల్సిన మెటీరియల్స్ ఎప్పటికప్పుడు అందజేయాలని పేర్కొన్నారు. బిల్లులు జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. అనంతరం అంబేద్కర్ సర్కిల్ నుంచి వై జంక్షన్ వరకు చేపట్టే రోడ్లు విస్తరణ పనులను చేపట్టాలని ప్లానింగ్ అధికారులను ఆదేశించారు.

శంకర్‌ను పరామర్శించిన రెడ్యం

కడప అర్బన్ : మాసాపేటకు చెందిన టిడిపి సీనియర్ నాయకులు శంకర్‌ను ఆ పార్టీ రాష్ట్ర నాయకులు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి పరామర్శించారు. మంగళవారం మాసాపేటలో ఆయన స్వగృహానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టిఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాసాపేట శివ, ఐటిడిపి ప్రతినిధి హరిబాబు పాల్గొన్నారు.

అధ్యక్ష, కార్యదర్శులుగా రాయుడు, కుమార్

ప్రజాశక్తి - మైలవరం

సంజీవ రాయుడు, మునికుమార్

ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం మైలవరం మండలశాఖ నూతన కమిటీని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు శివ నారాయణ ఆధ్వర్యంలో మంగళవారం ఎన్నుకున్నారు. చేనేత కార్మిక సంఘం మండలశాఖ అధ్యక్షుడుగా సంజీవ రాయుడు, కార్యదర్శిగా మునికుమార్, ఉప కార్యదర్శిగా ధనుంజయ, ఉపాధ్యక్షులుగా శ్రీనివాసులు, కొండయ్య, సభ్యులుగా బోలిశెట్టి వెంకటేశ్వర్లు, శివశంకర్, ఒరిగి కృష్ణను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శివనారాయణ మాట్లాడుతూ నూతన మండల కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. చేనేత కార్మిక సమస్యలను మండలంలో అధ్యయనం చేసి రాజీలేని పోరాటాలు నిర్వహించాలని సూచించారు. అనంతరం అధ్యక్ష, కార్యదర్శులు సంజీవరాయుడు, మునికుమార్ మాట్లాడుతూ మండల నూతన కమిటీ ఏర్పాటుకు సహ కరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో చేనేత కార్మికుల సమస్యలపై ప్రతి గ్రామానా పర్యటించి కార్మిక సమస్యలపై అధ్యయనం చేసి పోరాటాలను నిర్వహిస్తామని తెలిపారు. ఇందుకు చేనేతలు కలిసి రావాలని కోరుతున్నామన్నారు.

విశ్వసనీయతను కోల్పోయిన సిబిఐ : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

కేంద్రంలోని మోడీ పాలనలో సిబిఐ పూర్తిగా తన విశ్వసనీయతను కోల్పోయిందని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి పేర్కొన్నారు. స్థానికంగా మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సిబిఐ దేశంలోనే సర్వోన్నత దర్యాప్తు సంస్థ అన్నారు. సిబిఐను 1963లో ఏర్పాటు చేశారన్నారు. ప్రత్యక్షంగా ప్రధానమంత్రి ఆధ్వర్యంలో ఈ సంస్థ ఉంటుందన్నారు. మోడీ పాలనలో సిబిఐ తన లక్ష్యాలను పూర్తి విస్మరించిందని ఆరోపించారు. జయలలిత, లాలూప్రసాద్ యాదవ్, మనీష్ సిసోడియా, జగన్‌మోహన్‌రెడ్డి వంటి వ్యక్తులను అరెస్ట్ చేసిన సిబిఐ వివేకా హత్య కేసులో ఎంపీ అవినాష్‌రెడ్డిని అరెస్ట్ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉండడం శోచనీయమన్నారు. అవినాష్‌రెడ్డిని కర్నూలులో అరెస్ట్ చేస్తే శాంతిభద్రతల సమస్య ఉత్పన్నం అవుతుందని రాష్ట్ర పోలీసులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా ఎంపీ అవినాష్‌రెడ్డిని అరెస్టు చేసి సిబిఐ తన విశ్వసనీయతను నిరూపించుకోవాలని కోరారు.

మానవత్వం చాటుకున్న జెబివిఎస్ సేవా సంస్థ

ప్రజాశక్తి - ఖాజీపేట

అనాథకు హెయిర్ కట్టింగ్ చేస్తున్న సంస్థ ప్రతినిధులు

సమాజ సేవ స్థాపనలో జెబివిఎస్ ది ప్రిజర్వర్ సేవా సంస్థ ఎప్పుడూ ముందుంటుందని, తమవంతు సాయం అందించేందుకు కృషి చేస్తామని సేవా సంస్థ అధ్యక్షులు అశోక్ మంగళవారం తెలిపారు. అనాథలు, అభాగ్యులకు ఉచితంగా దుస్తులు పంపిణీ చేయడంతోపాటు, హెయిర్ కట్టింగ్, షేవింగ్, నెయిల్ కట్టింగ్ వంటి సేవలు అందిస్తున్నామన్నారు. అంతేకా వారి బాగోగులకు సాయం అందించేలా పాటుపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమానికి సహాయ సహకారాలు అందించిన కడప ఆర్ట్స్ కాలేజి అధ్యాపకులు సతీష్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, నీలయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి ఒక్కరూ సేవా దృక్పథంతో ముందుకెళ్లాలని అశోక్ పిలుపునిచ్చారు.

నేడు అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి - ఖాజీపేట

మండలంలోని పూసలుకొట్టాల గ్రామం వద్ద కడప–కర్నూలు జాతీయ రహదారిపై నిర్మించిన అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ అధ్యక్షులు పివి కృష్ణారెడ్డి, అయ్యప్ప ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా తెల్లవారుజాము నుంచే పూజలు, అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. బండలాగుడు పోటీలు ఏర్పాటు చేశామన్నారు. ఉదయం కోలాటం వేయనున్నట్లు తెలిపారు.

ప్రత్యేక ప్రార్థన చేస్తున్న వైఎస్ విజయమ్మ, కుటుంబ సభ్యులు

ఘనంగా వైఎస్ రాజారెడ్డి వర్ధంతి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

వైఎస్ రాజారెడ్డి వర్ధంతి వేడుకలు పులివెందులలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్ విజయమ్మ, కుటుంబ సభ్యులు వైఎస్ జయమ్మ, రాజారెడ్డి సమాధుల వద్ద పూల మాలవేసి నివాళులర్పించి, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనాధలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో వైఎస్ జార్జిరెడ్డి సతీమణి వైఎస్ భారతమ్మ, వైఎస్ సోదరుడు వైఎస్ సుధీకర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, వైఎస్ఆర్ అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కడప : స్థానిక వైసిపి జిల్లా కార్యాలయంలో వైఎస్ రాజారెడ్డి 25వ వర్ధంతి సందర్భంగా మంగళవారం ఆయన చిత్రపటానికి రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్ ఖాన్, మహిళ నగర అధ్యక్షులు తెలుగుపులి వెంకటసుబ్బమ్మ, నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ పిట్టు బాలయ్య, ఎంపిపి చీర్ల సురేష్‌యాదవ్, కార్యకర్తలు, మహిళా నాయకులు టిపి వెంకట సుబ్బమ్మ, కో–ఆప్షన్ సభ్యులు మరియ, కృష్ణవేణి పాల్గొన్నారు.

ఆశాజనకంగా పత్తి పంట

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ఈ సంవత్సరం సాగు చేసిన పత్తి పంట ఆశాజనకంగా ఉంది. రైతులు పత్తి సాగుపై దృష్టి సారించారు. ఏటా వేసవి ఆరంభంలో పత్తి పంట సాగు రైతులు సాగు చేస్తారు. దాదాపు 1000 హెక్టార్లలో పత్తి పంట సాగు చేసినట్లు అధికారులు అంచనా వేశారు. ప్రకృతి అన్ని విధాలా సహకరిస్తే పత్తి రైతు కష్టాల నుంచి గట్టెక్కే అవకాశం ఉంది. ఈ సందర్భంగా రైతు మాటల్లో.. దీర్ఘకాలిక పంటగా పత్తి సాగు చేస్తామన్నారు. పూర్తిస్థాయి దిగుబడి చేతికందాలంటే ఆరు నెలలు సమయం పడుతుందన్నారు. ప్రారంభించిన నాలుగో నెల నుంచి పత్తి దిగుబడి మొదలవుతుందని తెలిపారు. సూపర్ బంతి, ప్రాఫిట్ ప్లస్, నందిని గోల్డ్, రాశి వంటి కంపెనీ విత్తనాలతో పత్తి పంట వేస్తారన్నారు. వారానికి ఒకసారి నీటిని తప్పనిసరిగా అందించాల్సి ఉందన్నారు. సంరక్షణ చర్యలు కూడా చేపట్టాల్సి ఉంటుందన్నారు. ప్రకృతి అన్ని విధాలా సహకరిస్తే 12 నుంచి 14 క్వింటాళ్ల పత్తి దిగుబడి చేతికందుతుందన్నారు. గతేడాది రూ.11000 చొప్పున ధర పలికిందన్నారు. దిగుబడి చేతికందేనాటికి ధర మరింత పెరుగుతుందని తాము ఆశిస్తున్నట్లు రైతులు తెలిపారు.

సాగులో ఉన్న పత్తి పంట